

హైదరాబాద్ వార్త

న్యూమోనియా లక్షణాలతో ఆస్పత్రులకు

# క్యూకడుతున్న బాధితులు

## పెరుగుతున్న గొంతు, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లు ❐ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుల సూచన



హైదరాబాద్, అక్టోబరు 26,ప్రభాతవార్త: చలి పెరగడంతో న్యూమోనియాతో వణికిపోతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ప్రైవేట్ ఆస్పత్రులను పరిశీలిస్తే ప్రతి పదిమందిలో కనీసం రెండు న్యూమోనియా కేసులే ఉంటున్నాయి. అప్పుడే పుట్టిన బిడ్డనుంచి ఐదేళ్లలోపు ఈవ్యాధి బారిన అధికంగా పడుతున్నారు. పలువురు మృత్యువు బారినపడుతున్నారు. ప్రభుత్వ పరంగా వైద్యసేవలు అంతంత మాత్రమే కావడంతో పేదలు బాధితులవుతున్నారు. దగ్గు, గొంతు నొప్పి, చెవి ఇన్‌ఫెక్షన్లు, న్యూమోనియా, బ్రాంకైటిస్, ఆస్తమా తోపాటు శ్వాసతీసుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ చిన్నపిల్లల ఆస్పత్రి నిలోఫర్‌లో కూడా గత వారం నుంచి వివిధ రకాల సమస్యలతో చికిత్స కోసం పిల్లను తల్లిదండ్రులు తీసుకువస్తున్నారు. సాధారణ రోజుల్లో 600వరకు ఓపి ఉంటే అది వెయ్యికి దాటింది. అందులో సుమారు 50-100కేసుల న్యూమోనియా లక్షణాలతో ఉంటున్నట్లు తెలుస్తుంది. కేవలం నిలోఫర్‌మాత్రమే కాకుండా గాంధీ,ఉస్మానియా,ఫీవర్ ఆసుపత్రికి సైతం రోగుల సంఖ్య పెరిగింది. ఈవ్యాధిబారిన పడేవారిలో పెద్దల్లో మద్యపానం, ధూమపానం, సమాయనికి ఆహారం తీసుకపోవడం వల్ల ఈవ్యాధి వస్తుండగా,చిన్నారుల్లో వ్యాధి నిరోదకశక్తి తక్కువగా ఉండటం వల్ల,టీకాలు సరిగా వేయించకపోవడం వల్ల సమంక్రమించే అవకాశం ఉందని డాక్టర్లు చెబుతున్నారు. ప్రధానంగా గాలీనీరు ద్వారా ఇది సక్రమిస్తుంది. చిన్నారుల్లో పీల్చే గాలి,తాగే నీరు ద్వారా వా ్యధికారక బ్యాక్టీరియా లైదా వైరస్ గొంతు నుంచి ఊపిరితిత్తులకు చేరతుంది.అప్పుడు ఊపిరితిత్తుల రుగ్మతకు గురై న్యూమోనియాగా మారుతుంది. సకాలంలో గుర్తించి చికిత్స చేయించకపోతే ఊపిరితిత్తుల నుంచి రోగపీడిత రక్తం గుండెకు సరఫరా అవుతుంది. గుండె ఇతర అవయవాలకు రక్తాన్ని పంపు చేయడంతో శరీరమంతా ఇన్‌ఫెక్షన్ అవుతుంది.

**నాలుగు రకాలుగా సోకే అవకాశం..** వ్యాధి తీవ్రతను బట్టి నాలుగురకాలుగా విభజించారు. బ్యాక్టీరియల్ నియోనియా,వైరల్ న్యూమోనియా శ్వాశకోస సంబంధిత న్యూమోనియా, ఫంగల్ న్యూమోనియా. బ్యాక్టీరియా వ్యాధి సాధారణంగా వచ్చేంది. దీనివల్ల శ్వాస తీసుకోవడంలో సమస్యలు వస్తాయి. ఇన్‌ఫ్లూయిజా ఏ,బి వ్యాక్సిన్లతో నివారించవచ్చు. శ్వాసకోస న్యూమోనియా శుభ్రంలేని ఆహారం, ద్రవాల ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఫంగల్ నియోనియా విషజ్వరం వచ్చినప్పుడు ఫంగస్‌ల కారణంగా వస్తుంది. ఆహారం తీసుకోవడంలో ఇబ్బంది పడటం, వాంతులు అలవుతుంటే మాత్రం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స చేయించడం అవసరం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో న్యూయోనియాకు సంబంధించి ఇచ్చే పీవీసీ వ్యాక్సిన్లు అందుబాటులో లేవు. వీటిని కొనుగోలు చేయాలంటే కనీసం 2వేల నుంచి 4వేల వరకు ఉంటుంది. కొన్ని రాష్ట్రాల్లో వీటిని ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుండగా, మన దగ్గర మాత్రం ఇంకా అందుబాటులో రాలేదు. దీంతో బాధితులు ప్రైవేట్ ఆస్పత్రులను అశ్రయించాల్సి వస్తుంది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో సగటున రూ.5వేల నుంచి 7వేల వరకు ఖర్చవతుంది. చలితీవ్రత పెరగడం,కేసుల తీవ్రత నేపథ్యంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో న్యూయోనియాకు సంబంధించిన చికిత్సలపై దృష్టిసారించి ప్రాణాపాయంనుంచి కాపాడాల్సిన ఆవశ్యకత ఉంది.

**ఈ జాగ్రత్తలు అవసరం..**
ఈకాలంలో పొగమంచు ఎక్కువ. ఫలితంగా గాలిలో కాలుష్యంపైకి పోదు. వాకింగ్‌కు వెళ్ళేవారు దీనిబారిన పడి వివిధ శ్వాసకోశ వ్యాధులకు గురవుతారు. బాగా ఎండవచ్చాక నగకకు వెళ్ళాలి. ఉన్ని దుస్తులు, చేతులకు తొడుగుల, ముక్కు,చెవులు మూసేలా ముసుగుల్లాంటివి ధరించడం వల్ల చల్లధనం నుంచి కాపాడుకోవచ్చు. సాయంత్రం సమయాల్లో వ్యాయామం చేయడం మంచింది. పిల్లలను బడులకు పంపే ముందు ఉన్నిదుస్తులు, షూ, చేతులకు తొడుగులు, కాళ్ల చేతులకు కప్పిఉంచేలా జాగ్రత్తలు తీసుకోవాలి. కాచి చల్లార్చిన నీటినే నెలలు నిండక ముందే పు ట్టిన పిల్లలు, ఎన్ఐసీయూ ఉన్న శిశువులు,అప్పుడే పుట్టిన శిశువుల పరంగా జాగ్రత్తలు తీసుకోవాలి. చేతులు శుభ్రం చేసుకోకుండా వారిని తాకకూడదు. గర్భిణులు, అయిదేళ్లలోపు పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. రాత్రి ఉదయం, సాయంత్రం వేళ్లలో బయటకు తిరగకుండా చూసుకోవాలి. అవ యవ మార్పిడి చేసుకున్న వారిలో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉటుంది. చలిలో తిరగడం వల్ల ఇలాంటి వారు త్వరగతిన వైరల్ వ్యాధుల భారిన పడతారు. బయటకు వచ్చేటప్పుడు ముక్కు, నోరు, చెవులు, కప్పే మాస్కులను ధరించాలి. ఉన్ని దుస్తులను వేసుకోవాలి. ఎయిడ్స్, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక రోగుల్లో వ్యాధి నిరోదశక్తి తక్కువ, చలిలో తిరగడం వల్ల శ్వాసకోశ, ఊపిరితిత్తుల వ్యాధులు దాడి చేసే అవకాశం ఉంది. బయట నుంచి ఇంటికి వచ్చినప్పుడు కాళ్లు, చేతులు, ముఖ్యం సబ్బుతో కడుక్కోవడ మంచింది. ఒకరి నుంచి మరొకరికి వైరల్ వ్యాధులు సోకకుండా చూసుకోవచ్చు. తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు చేతి రుమాలు ముక్కు,నోటికి అడ్డంగా పెట్టుకోవాలి. మరుగుదొడ్లను వినియోగించాక సబ్బుతో చేతులు కాళ్లు కడుక్కోవాలి. పెంపుడు జంతువులను తాకినప్పుడు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. భోజనం వండే సమయంలో శుభ్రత పాటించాలి. సాధ్యమైనంత వరకు చల్లని పదార్థాలు, పానియాలకు దూరంగా ఉండాలి. గోరువెచ్చని నీటిని తీసుకోవాలి. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు.. పిల్లలు, వృద్ధులు, న్యూమోనియా, స్వైన్‌ఫ్లూ సోకకుండా వ్యాక్సిన్లు తీసుకోవాలి.

# దుర్భాషలాడిన కుటుంబ సభ్యులపై కేసులు

ధర్నాచౌక్, అక్టోబర్ 26, ప్రభాతవార్త: దీపావళి పండుగ సందర్భంగా దీపాలు పెట్టుకున్న యువతులపై అకారణంగా దుర్భాషలాడుతూ దీపాలను కాళ్లతో తన్నివేసిన కుటుంబ సభ్యులపై చిక్కడపల్లి పోలీసులు కేసులు నమోదు చేశారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోల్కొండ క్రాస్ రోడ్సులోని అర్చన అపార్ట్ మెంట్‌లోని నాలుగవ అంతస్థులోని ఫ్లాట్‌లో షాలినీ దేవకృప(63), జీ.ఏ.క్రిస్టోఫర్ (68), రాజీవ్ అబ్రహాం (36), అజిత్ ఎబెన్‌జెర్ (34) అనే నలుగురు కుటుంబ సభ్యులు నివసిస్తున్నారు. ఈనెల 25 సాయంత్రం వీరి ఎదురు ఫ్లాట్‌లో నివసించే యువతులు దీపాలు పెట్టుకోవటంతో, ఆగ్రహించి, దీపాలను తీసేయాలని, కాళ్లతో తన్నుతూ, ఎందుకు అని ప్రశ్నించిన యువతులపై దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడ్డారు. బాధిత యువతులు చిక్కడపల్లి పోలీసులను ఆశ్రయించి, జరిగినది వివరించటంతో పోలీసులు షాలినీ దేవకృప కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేశారు.

**హిందూ సంఘాల నేతల నిరసన..** దీపాలను తన్నివేసిన ఘటన సోషల్ మీడియాలో వైరల్ కావటంతో స్పందించిన వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు పెద్దఎత్తున గోల్కొండ క్రాస్ రోడ్సుకు చేరుకుని హిందూ మనోభావాలను దెబ్బతీసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం రాత్రి ఆందోళన చేపట్టిన విషయం తెలిసినదే. పోలీసులు బాధిత యువతులకు న్యాయం చేస్తామని, హామీ ఇవ్వటంతో మంగళవారం రాత్రి వెనుతిరిగిన హిందూ సంఘాల నేతలు బుధవారం ఉదయం చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌వద్ద నిరసనకు దిగారు. హిందూ యువతులను అకారణంగా దూషించి, భయభ్రాంతులకు గురిచేసిన వారిపై తూ తూ మంత్రంగా కేసు నమోదు చేస్తే సహించబోమని, వారిని అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లౌకిక ధర్మానికి విరుద్ధంగా మత స్వేచ్ఛను హరిస్తూ పం డుగ పూట చెప్పులతో దాడి చేయటం విచారకరమని అన్నారు. ఇది యావత్ హిందూ సమాజం మీద జరిగిన దాడి అని, దీనిపై పోలీసులు ఉదాశీనంగా వ్యవహరిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో రాంవీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సురేందర్ రెడ్డి, పండరీనాథ్, అజయ్ రాజ్, చేతన్జి, లలిత్, నరసింహ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న హిందూ సంఘాల నేతలు

**బీజేపీ నాయకుల నిరసన..**
హిందూ యువతులపై అకారణంగా ఒక కుటుంబం దుర్భాషలాడుతూ దాడికి ప్రయత్నించటాన్ని బీజేపీ నాయకులు తీవ్రంగా నిరసించారు. రాంనగర్ కార్పోరేటర్ రవిచారి చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చి కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సెక్షన్ 506, 355, 295ఏ క్రింద కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ అసెంబ్లీ కోకన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, బీజేవైఎం కన్వీనర్ గడ్డం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉజ్వల నగరంగా హైదరాబాద్

## ఐదు రోజుల్లో రిజిస్ట్రేషన్ సమస్యకు పరిష్కారం

## ఎల్బీనగర్లో 17 ఫ్లైఓవర్‌లు, అండర్ పాసులు

### నాగోల్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్

ఎల్.బి.నగర్, అక్టోబర్ 26 ప్రభాతవార్త: శరవేగంగా అభివృద్ధి చెందుతూ భారతదేశంలోనే ఉజ్వలమైన నగరంగా హైదరాబాద్ నిలుస్తుందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం నాగోల్‌లో రూ.150కోట్లతో నిర్మించిన ఫ్లైఓవర్ను ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో కలిసి బుధవారం మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకొని నగరాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు వరల్డ్ గ్రీన్‌సిటీగా హైదరాబాద్ నగరం ఎంపిక అయిందంటే ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభి.వృద్ధి పనులే నిదర్శనం అన్నారు. ఎల్బీనగర్లో రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారానికి మరో ఐదు రోజులలోపు తెరదింపుతూ ఆర్డర్ తీసుకువస్తామని ప్రకటించారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు అనేక సార్లు సమావేశాలు నిర్వహించి రిజిస్ట్రేషన్ సమస్యకు శాశ్వత పరి ష్కారాన్ని త్వరలో పూర్తి చేస్తామన్నారు. నగరంలో రూ.8,52,924 కోట్లతో ఎస్ఆర్‌డిపి ద్వారా 47అండర్‌పాస్ పనులు చేపడితే అందులో ఎల్బీనగర్ ప్రాంతంలోనే 17పనులు చేపట్టడం జరిగింద న్నారు. నాగోల్ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో ట్రాఫిక్ సమస్య కు పరిష్కారం లభించిందన్నారు. రూ.400కోట్లతో ఎల్బీనగర్లో రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. మరో ఆరు నెలలలో మిగిలిన పనులు రూ.700 కోట్లతో పూర్తి చేస్తామన్నారు. రూ.600 కోట్లతో ఎల్బీనగర్లో మంచినీటి సౌకర్యం కల్పించామని, రూ.113 కోట్లతో 11వరద నీటి పనులు పూర్తి చేశామన్నారు. రాజకీయాలు ఎన్నికల సమయం లో చేయాలని, ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసమే పార్టీలు పక్కన పెట్టి ప్రజాప్రతినిధులు నిరంతరం పనిచేయాలని సూచించారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ నియోజక వర్గంలో మౌలిక వసతులు కల్పించేందుకు ఎప్పటికప్పుడు అభివృ ద్ధి పనులు చేపడుతున్నామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఫ్లైఓవర్లు అండర్‌పాస్‌లు ఎల్బీనగర్‌లో ఉన్నాయన్నారు. మంచినీరు, డ్రైనే జీ, రోడ్లు, ట్రాఫిక్, వరదనీరు, పార్కులు ఇతర మౌలిక వసతులు కల్పిం చేందుకు ప్రత్యేక దృష్టి సారించి వాటిని పరిష్కరించడం జరిగిందన్నారు. ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి గత రెండు సంవత్సరాలుగా ఎస్ఆర్‌డిపి ద్వారా రూ.113కోట్లతో వరదనీటి సమస్య 80శాతం పూర్తి చేశామని తెలిపారు. మంత్రి కేటీఆర్ ఎల్బీనగర్‌పై ప్రత్యేక దృష్టి సారించడం వల్లే వేలకోట్ల రూపాయలతో గతంలో ఎప్పుడూ లేనివిధంగా అభివృద్ధి పనులు జరిగాయన్నారు. చాలా కాలంగా ఎదురుచూస్తున్న రిజిస్ట్రేషన్ సమస్యను కూడా త్వరలోనే మంత్రి కేటీఆర్ పరిష్కరిం చేందుకు కృతనిక్షయంతో ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు భోగ్గారపు దయానంద్‌గుప్తా, ఎగ్గే మల్లేశం, పట్నం మహేందర్ రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటకశాఖ అభివృద్ధి చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీమేయర్ శ్రీలత, కార్పొ రేటర్లు పవన్ కుమార్, చింతల అరుణ, మాజీ కార్పొరేటర్ చెరుకు సంగీత ప్రశాంత్‌గౌడ్, అనంతుల రాజారెడ్డి, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.



ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

# రసరమ్యం సందేశాత్మకం రసరంజని 'కన్యావరశుల్కం' నాటకం



కన్యావరశుల్కం నాటక ప్రదర్శనలో ఒక దృశ్యం

రవీంద్రభారతి, అక్టోబరు 26 ప్రభాతవార్త : ప్రముఖ సాంస్కృతిక, సాహితీ సంస్థ రసరంజని హైదరాబాద్ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో బుధవారం రాత్రి కె.జె.ఆర్. కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ సమర్పణలో ఉదయ్ భాగవతుల దర్శకత్వంలో తెలుగుజాతి హృదయాల్లో పదిలంగా ఉన్న గురజాడ అప్పారావు వ్రాసిన కన్యాశుల్కం, కాళ్లకూరి నారాయణరావు వ్రాసిన వరవిక్రయం నాటకాల నుండి కన్యాశుల్కం, వరవిక్రయం రోజులతో పాటు నేటి ఆధునికతరంతో కలిపి కొన్ని పాత్రలను తీసుకుని ఎం.వి.ఎస్.హరనాథరావు ప్రయోగాత్మకంగా రచించిన 'కన్యావర శుల్కం' నాటకం ఎంతో సందేశాత్మకంగా ప్రేక్షకులకు రక్తికట్టించి రసరమ్యంగా సాగిందని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి అన్నారు. నాటికీ నేటికీ కూడా దురాచారం ఏదైనా, దురదృష్టం మాత్రం ఆడవారిదేనన్న కథాసారాంశంతో ప్రధాన పాత్రల్లో గిరీశంగా ఉదయ్ భాగవతుల, అగ్నిహోత్రావధా నులుగా సుబ్బారావు, లింగరాజుగా శ్రీనివాస్, వెంకమ్మగా మాధవి, బుచ్చ మ్మగా డా. శ్రీజ తదితరులు అద్భుతంగా నటించి వారి పాత్రలో జీవించిన 'కన్యావరశుల్కం' నాటకం ప్రదర్శన వీక్షకుల హర్షధ్వానాల మధ్య ప్రశంసలందుకొని టిక్కెట్ కొని నాటకం చూడాలన్న సదుద్దేశాన్ని సందర్శకుల్లో పురిగొల్పుతూ గత 3 దశాబ్దాలుగా కృషి చేస్తున్న రసరంజని ప్రతీనెల ఒక నాటకాన్ని ప్రదర్శిస్తూ అటు రంగ స్థలానికి, ఇటు ఆయా కళాకారులకు ప్రోత్సాహాన్ని అందిస్తూ వస్తున్న విషయం విదితమైన నాటకప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులు అధిక సంఖ్యలో విచ్చేసి నాటక ప్రదర్శనను తిలకించి విజయవంతం చేశారు.

# సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనుల ఖరారు

- రూ. 699 కోట్లకు పైగా అంచనా వ్యయంతో స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేసేందుకు కాంట్రాక్ట్ అప్పగింత
- 36 నెలల కాలవ్యవధిలో పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించిన దక్షిణ మధ్య రైల్వే

తార్నాక, అక్టోబర్ 26 ప్రభాతవార్త: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులను దక్షిణ మధ్యరైల్వే ఖరారు చేసింది. రూ. 699 కోట్లకు పైగా అంచనా వ్యయంతో స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేసేందుకు కాంట్రాక్ట్ అప్పగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రపంచస్థాయి సౌకర్యాలఅను మెరుగైన సదుపాయలతో అందించేందుకు, స్టేషన్‌ల సుందరీకరణలో భాగంగా రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధిని ప్రారంభించాయని అధికారులు వెల్లడించారు. ఈ పనులు 36 నెలల కాలవ్యవదిలో పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం.నాన్ సబర్బన్ గ్రేడ్(ఎన్ఎస్‌జీ1) విభాగంలో జోన్ అంతటా ఉన్న ఒకే ఒక స్టేషన్ సికింద్రాబాద్ స్టేషన్. రూ.500 కోట్ల ఆదాయం లేదా సంవత్సరానికి 20 మిలియన్ల ప్రయాణికులు ఉన్న స్టేషన్లు ఎన్ఎస్‌జీ1 కిందకు వస్తాయి. ఈ స్టేషన్‌లో సగటున రోజుకు 200 రైళ్లను నడుపుతున్నారు. సగటున 1.8లక్షల మంది ప్రయాణికుల రాకపోకలు సాగిస్తున్నారు.ఇందుకు అనుగుణంగా ఆధునిక సౌకర్యాలు, సదుపాయాలతో స్టేషన్‌ను పెద్దఎత్తున అప్‌గ్రేడ్ చేయడానికి ప్రతిపాదించబడింది. ముఖ్యంగా స్టేషన్ కాంప్లెక్స్‌ను ప్రపంచస్థాయి సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు, ప్రయాణికుల సౌకర్యాలతో అనుసంధానించేందుకు దక్షిణ మధ్యరైల్వే మాస్టర్ ప్లాన్‌ను రూపొందించింది

ఈ సందర్భంగా ఇంచార్జి జీఎం అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేయడం ఎంతో అవసరం అన్నారు. ముఖ్యమైన రైల్వే స్టేషన్లను ప్రాధాన్యతా ప్రాతిపదికన అప్ గ్రేడ్ చేయడానికి కట్టుబడి ఉందన్నారు. నిర్ధిష్టకాలంలో పనులు పూర్తి అయ్యేవిధంగా చూస్తామని చెప్పారు.

# నడుస్తున్న కారులో మంటలు

## విద్యార్థులకు తప్పిన ప్రమాదం



దగ్ధమైన కారు

గచ్చిబౌలి, అక్టోబరు 26 ప్రభాతవార్త : నడుస్తున్న కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి కారు దగ్ధమైంది. కాగా కారులో ఉన్న మహిళతో పాటు నలుగురు పాఠశాల విద్యార్థులకు త ృటిలో ప్రమాదం తప్పింది. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... మణికొండలో నివాసం ఉంటున్న రాధిక దేవరపల్లి బుధవారం సాయంత్రం ఖాజాగూడ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నుంచి పిల్లలను తీసుకువచ్చేందుకు తమ మారుతి స్విఫ్ట్ కారు (ఎపి28 డిఎఫ్7944)లో వెళ్లింది. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నుంచి నలుగురు విద్యార్థులను కారులో ఎక్కించుకొని మణికొండకు తిరుగు ప్రయాణమైంది. ఈ క్రమంలో కొద్దిదూరం వెళ్లిన వెంటనే కారులో నుంచి అకస్మాత్తుగా పొగ రావడంతో కారును పక్కన నిలిపిన రాధిక విద్యార్థులను కిందకు దించింది. కాగా అప్పటికే మంటలు కారు మొత్తం వ్యాపించి కారు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రాధికతో పాటు నలుగురు స్కూల్ విద్యార్థులు క్షేమంగా బయటపడడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

# బీసీ గురుకుల పాఠశాలలో బోధనా సమయాన్ని మార్చాలి

## టీఎస్ యూటిఎఫ్ డిమాండ్

ధర్నాచౌక్, అక్టోబర్ 26, ప్రభాతవార్త: బీసీ గురుకుల పాఠశాలలో బోధనా సమయాన్ని ఇతర గురుకుల పాఠశాలల మాదిరిగానే ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు ఉండే విధంగా మార్చాలని టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే.జంగయ్య, చావ రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేస్తూ గురుకుల పాఠశాలలు అన్నింటిలో ఒకే విధమైన వేతనాలు అమలు చేస్తున్నందున, పనివేళలు కూడా ఒకేవిధంగా ఉండాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29న బీసీ గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి, విధులకు హాజరు కావాలని, విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పిలుపునిస్తోందని తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే నవంబర్ 13న హైదరాబాద్ ధర్నాచౌక్‌లో రాష్ట్ర స్థాయి మహాధర్నా నిర్వహిస్తామని పేర్కొన్నారు. అన్ని విద్యాసంస్థలలో బోధనా సమయం ఉదయం 9 నుండి సాయంత్రం 4.30 వరకే ఉండాలని తెలంగాణ ప్రభుత్వం 2015లోనే జీవో నెంబర్ 3 ను విడుదల చేసిందని, సాంఘిక, గిరిజన, మైనారిటీ సంక్షేమ గురుకులాల కాలపట్టికను మార్చారు కానీ, బీసీ గురుకుల పాఠశాలలో మాత్రం సొసైటీ అధికారులు ఉత్తర్వులు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే అధికారులు స్పందించి బీసీ గురుకుల పాఠశాలలో పనివేళలు సవరిస్తూ ఉత్వర్వులు ఇచ్చి, ఉపాధ్యాయుల ఆందోళనలు నివారించాలని డిమాండ్ చేశారు.

## ఒయూలో ఎస్సై కానిస్టేబుల్

# అభ్యర్థుల ఆందోళన

తార్నాక, అక్టోబర్ 26 ప్రభాతవార్త: ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులు బుధవారం అందోళనకు దిగారు. టిఎస్ఎల్ ఆర్‌బి విడుధల చేసిన ఫలితాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రశ్నపత్రంలో తప్పుగా ఇచ్చిన 22 ప్రశ్నలకు మార్కులు కలపాలని వారు డిమాండ్ చేశారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలని లేనిచో డీజీపీ ఆఫీస్ ముట్టడికి వెళ్లుతామని అభ్యర్థులు హెచ్చరించారు.

## గ్యాస్ పేలుడు ఘటన బాధిత కుటుంబాలను

# పరామర్శించిన నగర మేయర్, డిప్యూటీ మేయర్

మెట్టుగూడ, అక్టోబర్ 26 ప్రభాతవార్త: మెట్టుగూడ డివిజన్ దూద్ బావి వద్ద జరిగిన గ్యాస్ ప్రమాద జరిగిన ప్రాంతానికి నగరమేయర్ గద్వాల్ విజయలక్ష్మి, నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, స్థానిక కార్పోరేటర్ రాసూరి సునిత తదితరులు చేరుకొని బాదిత కుటుంబాలను పరా మర్శించారు. ఘటన తీరును అడిగి తెలుసుకున్నారు. మృతి చెందిన నారాయణ స్వామి, గాయాలకు గురైన మరో ఏడుగురి కుటుంబాలను కూడా వారు పరమార్శించారు. ప్రభుత్వం ద్వార బాదితులకు అండగా ఉంటామని వారికి బరోసాను ఇచ్చారు. బాదితులకు మెరుగైన వైద్యం అందేవిదంగా చూస్తామని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఐజీ కార్తికేయ, నార్త్ జోన్ డిసీసీ సందన దీప్తి, జోనల్ కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డిసి దశరథ తదితరులు పాల్గొన్నారు.



పేలుడు జరిగిన ప్రాంతంలో వివిరాలను తెలుసుకుంటున్న నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, డిసీపీ చందనా దీప్తి తదితరులు

## అంతరిక్షం గురించి విద్యార్థులకు

# వివరించిన ఇస్రో శాస్త్రవేత్తల బృందం

నార్సింగి, అక్టోబర్ 26 ప్రభాతవార్త : అంతరిక్షం, రాకెట్‌లు, వాటి పనితీరు గురించి ఇస్రో శాస్త్రవేత్తలు బుధవారం మణికొండలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వివరించారు. ఇస్రోకు సంబంధించిన బస్సు ద్వారా అంతరిక్షంలో రాకెట్లు ఎలా పని చేస్తాయి? ఏ ఏ రాకెట్లు ఏ విధమైన సాంకేతిక పరిజ్ఞానంను మనకు పంపిస్తున్నాయి? చంద్రయాన్, మంగళ్‌యాన్ ప్రయోగాల పనితీరు వంటి అంశాలను విద్యార్థులకు వీడియోల రూపంలో చూపించారు. వీటిని చూసిన విద్యార్థులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. ఉదయం 11.గంటల నుంచి సాయంత్రం 5.గంటల వరకు ఈ బస్సును అక్కడే ఉంచి పలు ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు కూడా అంతరిక్షం గురించి వివరించారు. ఈ సందర్భంగా ఇస్రో గ్రూప్ డైరెక్టర్ శ్రీనివాస రావ్ మాట్లాడుతూ భావి బారతం అంతా నేటి విద్యార్థులదేనని తెలిపారు. కలలు కనాలని, వాటి సాఫల్యత కొసం నిరంతరం కష్టపడాలని భారత అంతరిక్ష దిగ్గజ శాస్త్రవేత్త అబ్దుల్ కలాం సూచించారని, విద్యార్థులు కలాం సూచనలు పాటించి భవిషనయత్తులో పెద్ద పెద్ద శాస్త్రవేత్తలుగా ఎదుగాలని సూచించారు. ప్రశ్నించడం నేర్చుకుంటే, పరిశోధనపై ఆసక్తి పెరుగుతుందని, శాస్త్రవేత్తలుగా మారడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ కమీషనర్ ఫల్గుణ్ కుమార్, ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నిరంజన్, మంగ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మణికొండ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అంతరిక్షం, రాకెట్ల పనితీరును వివరించిన ఇస్రో శాస్త్రవేత్తల బృందం

# నిప్పులవాగు పుస్తకావిష్కరణ : అందెశ్రీ

హైదరాబాద్, అక్టోబరు 26,ప్రభాతవార్త: వాక్కులమ్మ ప్రచురణలో రూపొందించిన తెలంగాణ ఉద్యమపాట "నిప్పులవాగు "పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఈనెల 30న బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య కళా నిలయంలో నిర్వహించనున్నట్లు తెలంగాణ ఉద్యగేయ రచయిత కవి అందెశ్రీ తెలిపారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ అంబటి సురేంద్రరాజు, భూపతి వెంకటేశ్వర్లుతో కలిసి కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా అందెశ్రీ మాట్లాడుతూ తెలంగాణ అంటే ఒక్కరు కాదు.. సామూహికం, సమూహం అనే మాటకు ఈసంకలనం అగ్ని దర్పణం చేసిందన్నారు. భవిష్యత్‌గా చూడమని నిలబడి గెలవమని సవాలు విసురుతుందన్నారు. 30న మధ్యాహ్నం 2గంటలకు జరిగే ఈకార్యక్రమానికి జయగీర్ తిరుమలరావు అధ్యక్షతన వహిస్తారని, ముఖ్యఅతిధిగా విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి బి.సుదర్శన్‌రెడ్డి, అలాగే ముగురమ్మలు కోయ వనిత కుంజ రమనమ్మ, బైరాన్‌పల్లి పోరాట వీరమాత జంగిటి లచ్చవ్వ, పాలమూరు వలసల కష్టజీవి వలనమోని జానమ్మ చేతుల మీదుగా పుస్తకావిష్కరణ జరుగుతుందని పేర్కొన్నారు.



కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అందెశ్రీ, సురేంద్రరాజు, భూపతి వెంకటేశ్వర్లు తదితరులు

## ఆర్టీసీక్రాస్‌రోడ్స్ లక్ష్మీగణపతి ఆలయంలో ఎండోమెంట్ కమిషనర్ పూజలు

**చిక్కడపల్లి, అక్టోబరు 26, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ అనీల్‌కుమార్ దంపతులు బుధవారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని శ్రీలక్ష్మీగణపతి దేవాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న అనీల్‌కుమార్ దంపతులకు ఆలయం చైర్మన్ ముచ్చుకుర్తి ప్రభాకర్, ఈవో లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయం సభ్యుడు రమణమూర్తి, సిబ్బంది రాజు, రాజన్ ఆలయం అర్చకులు కాశీనాథ్‌శర్మ, జగన్మోహనాచార్యులు, రామాచారఉ్యులు, బుచ్చమాచార్యులు, గోపాలాచార్యులు, శ్రీధర్‌శర్మ భవాని ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు. వేదపండితులచే ఆశీర్వచనం అనంతరం అనీల్‌కుమార్ దంపతులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు.



పూజలో పాల్గొన్న అనీల్‌కుమార్ దంపతులు

## దూద్‌బావి ఘటనలో బాధితులను పరామర్శించిన డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

**సికింద్రాబాద్, అక్టోబర్ 26, ప్రభాతవార్త :** చిలకలగూడ దూద్‌బావిలో జరిగిన గ్యాస్ సిలిండర్ పేలుడు సంఘటనలో తీవ్రంగా గాయపడి గాంధీ ఆస్పత్రిలో చేరిన బాధితులను డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ గాంధీ ఆస్పత్రిలో పరామర్శించారు. ప్రభుత్వ పరంగా ఎలాంటి సహాయం కావాలనా బాధితులకు అండగా ఉంటానని వారికి హామీ ఇచ్చారు. అనంతరం వైద్యులతో మాట్లాడి వారి ఆరోగ్యస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స కోసం వెంటనే ఖలీమా బేగం, జాఫర్, నర్సింగ్‌రావు, శ్రీనివాస్‌లను సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స అందించేలా ఏర్పాట్లు జరిపారు. కాగా ఘటనలో మృతిచెందిన నారాయణస్వామీ కుటుంబాన్ని అదుకుంటామని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ తెలిపారు.



బాధితులను పరామర్శిస్తున్న స్పీకర్ పద్మారావు గౌడ్

**స్థానికులతో డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ :** దూద్‌బావిలో జరిగిన సంఘటన సమాచారం అందుకున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ స్థానిక టీఆర్ఎస్ నాయకులను అప్రమత్తం చేశారు. సంఘటన స్థలానికి తాను వస్తున్నానని, బాధితులకు సహాయకచర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సంఘటన స్థలానికి చేరుకుని జరిగిన సంఘటన పట్ల ఆరా తీశారు. గాయాలపాలైన వారికి ధైర్యం చెప్పి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎలాంటి పరిస్థితిలో నైనా తాను అండగా ఉంటానని వారికి హామీ ఇచ్చారు. వారిని గాంధీ అస్పత్రికి తరలించిన వెంటనే డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ కూడా గాంధీ ఆస్పత్రికి చేరుకున్నారు.

## మణికొండ మున్సిపల్ స్వచ్ఛ బ్రాండ్ అంబాసిడర్‌గా నాగబాబు

**నార్సింగి, అక్టోబర్ 26, ప్రభాతవార్త :** మణికొండ మున్సిపల్ స్వచ్ఛ బ్రాండ్ అంబాసీడర్‌గా ప్రముఖ సినీ నటులు కొణిదల నాగబాబు నియమితులయ్యారని కమీషనర్ ఫల్గుణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు నాగబాబుకు శుభాకాంక్షలు తెలిపామని కమీషనర్ వివరించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతను పౌరులంతా స్వచ్ఛందంగా పాటించాలని సూచించారు. మన ఇంటిలోని చెత్తను ఊడ్చి రోడ్లపై వేయవద్దని, ఇళ్లముందుకు వచ్చే ఆటోలలోనే వేసి పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. తడి,పొడి చెత్తలను ఇంటిలోనే వేరు చేసి రిక్షాల్లో వేస్తే తడి చెత్తతో ఎరువులను, పొడి చెత్తను రీసైక్లింగ్ సెంటర్లకు తరలించడం వీలు పడుతుందన్నారు. ఇది మన బాధ్యత అని ప్రతీ ఒక్కరూ భావించాలన్నారు. మణికొండ మున్సిపాలిటీలోని ప్రజలంతా ఏకతాటిపైకి రావాలని, పరిశుభ్రత- పారిశుద్యంలో మన మున్సిపాలిటీ నెంబర్ వన్‌గా నిలిచేలా బాధ్యతగా మెలుగుదామని నాగబాబు పిలుపునిచ్చారు. త్వరలో మణికొండ మున్సిపాలిటీలో జరిగే హరితహారం కార్యక్రమంలో కూడా పాల్గొంటానని నాగబాబు హామీనిచ్చారు.



నాగబాబుకు నియామక పత్రంను అందజేస్తున్న కమిషనర్ ఫల్గుణ్ కుమార్

## నేటినుంచి సిసిఆర్‌టిలో 'హైదరాబాద్-జపాన్ ఫెస్టివల్'

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త :** ఈనెల 27,28,29 తేదీల్లో హైటెక్‌సిటీలోని సిసిఆర్‌టి ( సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్స్ అండ్ ట్రైనింగ్)లో హైదరాబాద్-జపాన్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు ఆశాభాను జపాన్‌సెంటర్ ప్రెసిడెంట్ రామభద్ర తెలిపారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇండియా జపాన్ సంబంధాలు ప్రారంభమై 70ఏళ్లు అయిన సందర్భంగా హైదరాబాద్‌లో ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడురోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని గురువారం సైబరాబాద్ సిసి స్టీఫెన్ రవీంద్ర ఎగ్జిబిషన్ ప్రారంభిస్తారని తెలిపారు. అలాగే మరోరెండురోజులుపాటు సెమినార్, జపనీస్ ఫిల్మ్ ఫెస్టివల్, కల్చరల్ ప్రోగ్రాంలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు డాక్టర్ సిద్దిక్, నాగనాథ్, హరనాథ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రామభద్రం, సిద్దిఖ్, హరనాథ్, విజయ్ తదితరులు

## మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన కార్పొరేటర్ లక్ష్మీబాల్‌రెడ్డి

**సంజీవరెడ్డి నగర్, అక్టోబర్ 26, ప్రభాతవార్త :** దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆయన నివాసం వద్ద సనత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు సరఫ్ సంతోష్ పటేల్, ఉదయ నగర్ కాలనీ ప్రెసిడెంట్ నితిపుడి శ్రీకాంత్, తులసినగర్ ప్రెసిడెంట్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ లక్ష్మీబాల్‌రెడ్డి

## నవంబరు 20నుంచి 22 వరకు లిటరరీ ఫెస్ట్-2022

**చిక్కడపల్లి, అక్టోబరు 26, ప్రభాతవార్త :** తెలంగాణ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో నవంబరు 20వ నుంచి 22 వరకు నిర్వహించతలపెట్టిన లిటరరీ ఫెస్ట్-2022కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ 'పాటకు జేజేలు' పేరుతో ఈ కార్యక్రమాలుం టాయని, వాగ్గేయకారుల సమ్మేళనం, పాటలు, చర్చలు, పుస్తకావిష్కర ణలుంటాయని, వాగ్గేయకారులతో పాటలు పాడించడంతో పాటు వారు రాసిన పాటలను పుస్తకరూపంలో తీసుకురావడం జరుగుతుందని అన్నారు. అదే విధంగా సినిమా పాటల సాహిత్యంపై సెమినార్, సాహిత్య పరిశోధకులతో విశ్లేషణ వ్యాససంకలనం ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ ఫెస్టుకు సాహితీవేత్తలు, కవులు, రచయితలు, కళాకారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నిర్వాహక సంస్థ ఉపాధ్యక్షులు రాంపల్లి రమేశ్, తంగిరాల చక్రవర్తి, కోశాధికారి అనంతోజుమోహనకృష్ణ, చక్రవర్తి, సలీమా, శరత్, రామకృష్ణ, చంద్రమౌళి, లేఖ, పేర్ల రాములు, ప్రభాకరచారి పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

## సీఐ, తహశీల్దార్లకు సన్మానం

**ఘట్‌కేసర్, అక్టోబర్ 26, ప్రభాతవార్త :** ఘట్‌కేసర్ మండల వడ్డెర సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన శివరాత్రి వెంకటేష్ బుధవారం ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ వి.అశోక్‌రెడ్డి, తహశీల్దార్ ఎన్.విజయలక్ష్మిలను కలిశారు. ఇటీవల వడ్డెర సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో సీఐ అశోక్‌రెడ్డి, ఎస్ఐ బి.నాగార్జున్‌రెడ్డి, తహశీల్ కార్యాలయంలో తహశీల్దార్ విజయలక్ష్మి, నాయబ్ తహశీల్దార్ సిహెచ్.భాస్కర్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి మిఠాయి అందజేశారు. అట్టడుగువర్గానికి చెందిన వడ్డెర కులస్తుల సమస్యలపై అధికారులు సానుకూలంగా స్పందించి తమవంతు సహకారం అందించాలని వెంకటేష్ కోరారు.

## వచన కవితా పితామహుడు కుందుర్తి ఆంజనేయులు

**- సీబీఐ కోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతి శర్మ**

**చిక్కడపల్లి, అక్టోబరు 26, ప్రభాతవార్త :** వచన కవితా పితామహుడు కుందుర్తి ఆంజనేయు లు అనిసీబీఐ కోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతి శర్మ అన్నారు. ఎందరోమహానుభావులు మధురస్మృతులు కార్యక్రమంలో భాగంగా బుధవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో ప్రముఖ సాహితీవేత్త, కేంద్ర సాహిత్య అకాదమి పురస్కారగ్రహీత కుందుర్తి ఆంజనేయులు జయంతి సభ గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ నాగమారుతి శర్మ మాట్లాడుతూ అభ్యుదయ కవిగా, తెలుగు రచయితగా పేరును సంపాదించారన్నారు. అంతేకాకుండా ఆంధ్ర ప్రాంతంలో వచన కవితా ఉద్యమానికి ఆధ్యుడుఅని అన్నారు. అంతేకాకుండా రగిలించే తమ కవిత్వంలో తెలంగాణ సాయుధ పోరటానికి ఆజ్యం పోసిన కవులలో కుందుర్తి ఆంజనేయులు ఒకరన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి డాక్టర్ జెల్ది విద్యాధరరావు, ప్రముఖ కవి పెద్దూరి వెంకటదాసు, ప్రతాని రామకృష్ణగౌడ్, బోయినపల్లి కృష్ణమూర్తిగౌడ్, మోహన్‌గౌడ్, చిక్క రామదాసు తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న నాగమారుతి శర్మ

## ఫ్లోరైడ్ నివారణకు సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ

**నార్సింగి, అక్టోబర్ 26, ప్రభాతవార్త :** మునుగోడు నియోజకవర్గంలో టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి గెలుపు తథ్యమని రాజేంద్రన గర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం గండిపేట్ మండల టీఆర్ఎస్ అధ్యక్షులు రామేశ్వరం నర్సిహ్మా, నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ రేఖ యాదగిరి, సీనియర్ నేత, మాజీ ఎంపిటిసి గొల్ల నాగేష్ యాదవ్‌లతో కలిసి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ గట్టుప్పల్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ నివారణకు సీఎం కేసీఆర్ ప్రత్యేక నిధులు కేటాయించడంతో ఇప్పుడు ఫ్లోరైడ్ వ్యాధి తగ్గుముఖం పట్టిందన్నారు. అర్హులందరికి ఆసరా, వితంతు, వృద్దాప్య పించన్లు, రేషన్ కార్డులు, కళ్యాణలక్ష్మీ, కేసీఆర్ కిట్లు, రైతుబంధు, రైతు భీమా పతకాలు ఇచ్చి ఆదుకున్న ఏకైక ప్రభుత్వం టీఆర్ఎస్‌దని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ మేకల ప్రవీణ్ యాదవ్, వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ చైర్మన్ పొన్న రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం చేస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

## ప్రజలు ఐక్యమత్యంతో ఉత్సవాలు జరుపుకుంటున్నారు

**చార్మినార్, అక్టోబరు 26, ప్రభాతవార్త :** ప్రజలు కలిసి మెలిసి ఉత్సవాలను జరుపుకుంటున్నారని రాజ్యసభ సభ్యులు డాక్టర్.లక్ష్మణ్ అన్నారు. పాతబస్తీకి చెందిన బిజెపి నాయకులు, వ్యాపారి సంజయ్ కుమార్ అగర్వాల్ రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్‌ను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా మోడల్ యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్

**కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 26, ప్రభాతవార్త :** నిజాంపేట నారాయణ ఈటెక్నో స్కూల్ పాఠశాలలో జరిగిన మోడల్ యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్‌లో కూకట్‌పల్లి జోనల్ లెవెల్‌లో విద్యార్థులు అత్యుత్సాహంగా పాల్గొన్నారు. కూకట్‌పల్లి పరిధిలోగల 8 నారాయణ విద్యాసంస్థల నుండి ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు. వీరు వివిధ దేశాల ప్రతినిధులుగా వ్యవహరించి రష్యా ఉక్రెయిన్ యుద్ధ ప్రభావాల గురించి, ప్రపంచంలో శాంతి స్థాపన ఉన్నత విద్య, మెరుగైన ఆరోగ్యం, ఆర్థిక సమతుల్యత తదితర అంశాలపై చర్చించి వాటికి కావలసిన సమాధానాలను సలహాలను వ్యక్తపరిచారు. విద్యార్థులలో ఆలోచనాశక్తిని పెంపొందిచి ప్రపంచ దేశాల పట్ల పరిజ్ఞానాన్ని పెంచడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని నారాయణ పాఠశాలల నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కూకట్‌పల్లి జోన్ ఏజీఎం వి.వేణుగోపాల్, కోఆర్డినేటర్ శ్రీలక్ష్మీ, పాఠశాల ప్రిన్సిపాల్ టి.సుహాసిని, సాఫ్ట్ స్కిల్క్ ట్రైనర్ జి.యోగేంద్ర, షఫీ, ప్రమోద్, బాలు, రుచిత, జూరి మెంబర్స్ సురేష్, ఈశ్వర్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న విద్యార్థులు

## వడ్డేపల్లిని కలిసిన బిజెపి సీనియర్ నేతలు

**కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 26, ప్రభాతవార్త :** బిజెపిలో చేరిన కూకట్‌పల్లికి చెందిన సీనియర్ నాయకులు తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు అడ్వైజరీ కమిటీ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావును బిజెపికి చెందిన పలువురు సీనియర్ నాయకులు బుధవారం మరాదపూర్వ కంగా కలిశారు. ఓబీ సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పర్వతాలు యాదవ్, వివేకానందనగ ర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు నర్సింగరావులు ఈ సందర్భంగా పూలబొకె అందజేసి శాలువాతో సత్కరించి బిజెపిలో చేరినందుకు ప్రత్యేకంగా అభినం దనలు తెలియజేశారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ మా నాన్న స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగరావు అడుగుజాడల్లో నడుస్తూ కార్యకర్తలైన ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ బిజెపి బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు.



రాజేశ్వరరావును కలిసి అభినందిస్తున్న బిజెపి శ్రేణులు

## మద్యం మత్తులో బార్‌పై యువకులు దాడి

**అల్వాల్, ఆగస్టు 26, ప్రభాతవార్త :** మద్యం మత్తులో బార్‌పై యువకులు దాడి చేసి అద్దాలు ఫర్నీచర్ ద్వంసం చేసిన ఘటన అల్వాల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. అల్వాల్ రాజీవ్ రహదారి వద్ద శ్వేత బార్ అండ్ రెస్టారెంట్ ఉంది. బుధవారం సాయంత్రం 8 గంటలు సమమయంలో వెంకటాపురం ప్రాంతానికి చెందిన నలుగురు యువకులు బార్‌కు వచ్చారు. బార్‌లో మద్యం సేవించిన అనంతరం ద్విచక్ర వాహనం పార్కింగ్ విషయంలో వాగ్వివాదం చోటు చేసుకుంది. ఒక్కసారిగా రెచ్చి పోయిన యువకులు కర్రలతో బార్‌పై దాడి చేశారు. అర్థ నగ్నంగా వారు చేసిన హల్‌చల్ స్థానికులను భయభ్రాంతులకు గురి చేసింది. బార్‌లో అద్దాలు పగలుకొట్టడంతో పాటుగా ద్విచక్ర వాహనాలపై తమ ప్రతాపం చూపారు. విషయం పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మానసను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సాయన్న

## మిస్ ఇండియా విజేతను అభినందించిన ఎమ్మెల్యే

**కంటోన్మెంట్, అక్టోబర్ 26, ప్రభాతవార్త :** టిస్కా సంస్థ నిర్వహించిన మిస్ ఇండియా కాంటెస్ట్ 22 లో మిస్ ఇండియా కిరీటాన్ని చెజిక్కించుకున్న బోయిన్‌పల్లి సంచారపురి కాలనీకి చెందిన డాక్టర్ మానస మరియా అగస్టిన్ సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి. సాయన్నను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాయన్న ఆమేకు శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. కిరీటాన్ని దక్కించుకోవడం పట్ల అభినందనలు తెలిపారు. ఈ కార్యాక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, ముప్పిడి మధుకర్ నివేధితలు పాల్గొన్నారు.

## ట్రాఫిక్‌పై అవగాహన

**కంటోన్మెంట్, అక్టోబర్ 26, ప్రభాతవార్త :** సెయింట్ మేరీస్ జూనియర్ కాలేజీలో బేగంపేట్ టీటీఐ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు, టీటీఐ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, కాలేజీ ప్రిన్సిపాల్ ఫాదర్ జ్ఞాన్ నెడ్డి, గోపాలపురం ట్రాఫిక్ ఇన్స్‌స్పెక్టర్ భరత్‌కుమార్‌లు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతగా నిలిచిన విద్యార్థికి హెల్మెట్ బహూకరించారు.

## వైభవంగా కాళీ మాత మహోత్సవాలు

**చార్మినార్, అక్టోబరు 26, ప్రభాతవార్త :** రికాబ్‌గంజ్ బెంగాలీ సమితి ఆధ్వరంలో అత్యంత వైభవంగా కాళీ మాత మహోత్సవాలు జరుగుతున్నాయి. దీపావళీ సందర్భంగా నిర్వహించిన పూజ కార్యక్రమంలో సంఘ సేవకులు మహేంద్రతో పాటు బెంగాలీ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

## పెండింగ్‌లో ఉన్న కేసీఆర్ కిట్లను తక్షణమే అందించాలి

**టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా**

**ధర్నాచౌక్, అక్టోబర్ 26, ప్రభాతవార్త :** కేసీఆర్ కిట్టు పథకం ద్వారా లక్షన్నరకు పైగా కిట్లు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే పెండింగ్‌లో ఉన్న కేసీఆర్ కిట్లను లబ్ధిదారులకు అందించాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. బుధవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ నగర కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2017 లో తెలంగాణ ప్రభుత్వం కేసీఆర్ కిట్లు పేరుతో ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకం ద్వారా ఆశించిన మేర పేదలకు లబ్ధి చేకూరటం లేదని అన్నారు. ప్రోత్సాహకంగా ఇవ్వాల్సిన నగదు కూడా కొన్నాళ్లుగా నిధులు లేవనే వంకతో ఇవ్వటం లేదని ఆరోపించారు. బాలింతలకు అందవలసిన కేసీఆర్ కిట్లు, ప్రోత్సాహకాలు అందకపోవటంతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ నిరాశకు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజలకు నమ్మకం కలిగించాలంటే వెంటనే పెండింగ్‌లో ఉన్న లక్షన్నరకు పైగా కిట్లను లబ్దిదారులకు అందచేయాలని, అదే విధంగా ప్రోత్సాహక నగదును అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల కిషోర్, ప్రధాన కార్యదర్శి బాలరాజ్‌గౌడ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దోజు రవీంద్రాచారి, జి.యాదగిరి రావు పాల్గొన్నారు.

## కీసరగుట్టలో కార్తీక మాస పూజలు

**కీసర, అక్టోబరు 26, ప్రభాతవార్త :** తెలంగాణాలోనే సుప్రసిద్ధ శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో నెకల రోజుల పాటు జరుగబోయే కార్తీక మాస పూజలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సూర్య గ్రహణం అనంతరం దేవాలయ సంప్రోక్షణ, మహన్యాస పూర్వక రుద్రాభిషేకములు, బసమాభిషేకం, గంధాభిషేకం, క్షీరాభిషేకం తదితర పూజా కార్యక్రమాల అనంతరం భక్తుల కు దర్శనానికి అనుమతిని ఇచ్చారు. కార్తీక మాస ప్రారంభం సందర్భంగా ప్రతిరోజు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, గణపతి హోమం, రుద్ర హోమములు ప్రతి రోజు జరుగుతాయని ఆలయ చైర్మన్ తెలిపారు. కార్తీక మాసం మొదటి రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు.

## కేంద్ర మంత్రిని కలిసిన బిజెపి నాయకులు

**చార్మినార్, అక్టోబరు 26, ప్రభాతవార్త :** పాతబస్తీ నూర్‌ఖాన్‌బజార్‌కు చెందిన సీనియర్ బిజెపి నాయకులు బిజెపి మైనార్టీ మోర్చ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ ఆధ్వర్యంలో పలువురు నాయకులు కేంద్ర మంత్రి ఎస్.పి.సింగ్ బాఘ్‌హెల్‌ను కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు షౌకత్ అలీ, దేవ్ జితేంద్ర, ప్రసూన్, సుందరంతో పాటు పలువురు పాల్గొన్నారు.



ఎస్.పి.సింగ్ బాఘ్‌హెల్‌తో బిజెపి నాయకులు

## పెండింగ్‌లో ఉన్న బోధనా, ఉపకారవేతన రుసుములను వెంటనే విడుదల చేయాలి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబరు 26, ప్రభాతవార్త :** పెండింగ్‌లో ఉన్న బోధనా, ఉపకారవేతన రుసుములను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ఎఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర డిమాండ్ చేశారు. బుధవారం మేడ్చల్ జిల్లా నూతన కలెక్టరేట్‌లోని కలెక్టర్ హరీశ్‌ను ఆయన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రాన్ని ఎఐవైఎఫ్ రాష్ట్ర,జిల్లా నాయకులు పాల్గొని అందజేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని వారు అందజేశారు. ఈ సందర్భంగ రాష్ట్ర ఎఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 2,700కోట్ల రూపాయలు బోధనా,ఉపకారవేతన రుసుములను వెంటనే విద్యార్థులకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగ ఇంజనీరింగ్ ఫీజులను పెంచుతూ విడుదల చేసిన జిఓ ఎంఎస్ నెంబర్ 37ను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగ డిగ్రీ,ఇంజనీరింగ్,పిజి, ఇతర వృత్తి విద్యాకోర్సుల ఫీజు బకాయిలు బోధనా, ఉపకార వేతనాలు చెల్లించటంలో తెలంగాణ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. 2021-2022విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ విద్యార్థుల బోధనా, ఉపకార వేతన బకాయిలు చెల్లించకపోవటంతో విద్యార్థి,యువత ఉన్నత విద్యకు దూరం కావల్సిన పరిస్థితి దాపురించే అవకాశం ఉందన్నారు.ఇంజనీరింగ్ కళాశాలల ఫీజుల పెంపుతో సామాన్య విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి ఉందన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలకు లాభార్జన చేకూర్చే విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అమోదించటం శోచనీయమన్నారు. ఉన్నత విద్యను దూరం చేసే విధానాలను ఏఐవైఎఫ్ తీవ్రంగ ఖండిస్తుందన్నారు.

## ప్రతి పేద కుటుంబానికి మంత్రి మల్లారెడ్డి అండ

**కీసర, అక్టోబర్ 26, ప్రభాతవార్త :** ప్రతి పేద కుటుంబానికి మంత్రి మల్లారెడ్డి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సర్పంచ్ నాయకపు మాధురి వెంకటేష్ అన్నారు. బుదవారం కీసరలో ఈ మద్య కాలంలో చనిపోయిన తమిళ తిరుపతి,తమిళ రవి,పిట్టల రాజు,అనసూయ,గుర్రం నరసింహ్మారెడ్డి కుటుంబాలకు మంత్రి మల్లారెడ్డి ట్రస్టు ద్వారా ఒక్కొక్కరికి 5 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహయం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మంత్రి మల్లారెడ్డి తన సొంత నిధులతో పేద కుటుంబాలను ఆదుకోవడం జరుగుతుందన్నారు.ప్రతి పేద కుటుంబానికి మంత్రి మల్లారెడ్డి అండగా నిలబడుతానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు రాగుల మంగ, మండల మీడియా అధ్యక్షులు గోరంటి ప్రవీణ్, గ్రామ పార్టీ అధ్యక్షులు చినింగణి బాలరాజు,ప్రధాన కార్యదర్శి రాగుల గణేష్, ఉపాధ్యక్షులు సుమన్, యూత్ అధ్యక్షులు మెట్టు పరమేష్, ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన మహేష్, బీసీ సెల్ అధ్యక్షులు మంత్రాల వెంకటేష్,యూత్ ఉపాధ్యక్షులు మిట్టపల్లి రాఘవేందర్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యువత రాజకీయాల్లో వచ్చి పేదలకు ఫలాలు అందించాలి

**సైఫాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త :** దేశంలో యువత రాజకీయాల్లోకి రాకపోవడం వల్ల రాజ్యాంగంపై అవగాహన లేనివారు, కనీస విద్యార్హత లేని వారు దేశంలో, రాష్ట్రంలో ప్రజా ప్రతినిధులుగా పాలన కొనసాగిన్నున్నారని ప్రముఖ రచయిత, బహుజన ఉద్యమ నిర్మాత సమతా సుదర్శనరావు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ఆహార పంపిణి విభాగం సలహా మండలి సభ్యులుగా నియమితులైన నగరానికి చెందిన సామాజిక కార్యకర్త రిజ్వాన్ మహమ్మద్‌కు బుధవారం ఎన్ఎస్ఎస్‌లో జరిగిన అభినందన సభలో ఆయన ప్రసంగించారు. ఈ సభకు ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ అధ్యక్షుడు డా. సి.హెచ్.భద్ర అధ్యక్షత వహించారు. రిజ్వాన్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్య వచ్చి 75 సంవత్సరాలు దాటుతున్నప్పటికి పేద, బదుగు బలహీన వర్గాల ప్రజలకు కనీస ఫలాలు దక్కడం లేదని, అందువల్ల యువత రాజకీయాల్లోకి వచ్చి దేశ భవితను రాజ్యాంగ బాధ్యతలను చేపట్టాలని పిలుపునిచ్చారు. సి.హెచ్.భద్ర మాట్లాడుతూ యువ నాయకుడు రిజ్వాన్ మహమ్మద్ దేశభక్తి భావాలను పునికి పుచ్చుకుని ఆనేక దేశాలలో ఉద్యోగ అవకాశాలు వచ్చినప్పటికి పక్కన పెట్టి దేశం మీద ప్రేమతో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నిరంతరం శ్రమిస్తూ కరోన కష్టకాలంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు. యువత రాజకీయాల్లోకి వచ్చి చట్ట సభలలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. సీనియర్ జర్నలిస్టు, ప్రముఖ రచయిత కరీం మాట్లాడుతూ రిజ్వాన్ అంచెలంచెలుగా ఎదుగుతూ జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వ ఆహార పంపిణి విభాగం సలహా మండలి సభ్యుడిగా నియమితులు కావడం గొప్ప పరిణామన్నారు. రిజ్వా మహమ్మద్ మాట్లాడుతూ తాను ఈ స్థాయికి ఎదగడానికి తల్లిదండ్రులు కుటుంబ సభ్యులని వారి అశీస్సులతో ప్రజలకు పూర్తిగా సహకరిస్తానని చెప్పారు.



రిజ్వాన్‌ను సత్కరిస్తున్న సమతా సుదర్శనరావు, సి.హెచ్.భద్ర


వార్త VAARTHA CLASSIFIEDS

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I MOHAMMED SALEEM R/O H. NO 19-2-239/37/A, F.NO 501, ICON TOWER CHANDULAL BARADARI, HYD, T.S. HAVE CHANGE NAME *MOHAMMED SALEEM HARFA*

★ I, TAHA JAMEEL D/O MOHAMMED JAMEEL UDDIN, R/O 17-1-223 TO 227, M.B.HAT, SANTOSH NAGAR, HYD-500059, T.S. HAVE TO ADD SURNAME AS "JAMEEL" AND GIVEN NAME "TAHA" IN PASSPORT .

LOST AND FOUND

★ LOST MY PASSPORT (P5900094) IN AND AROUND MEERPET AREA ON 20TH OCTOBER AT 2:00 PM . IF FOUND PLEASE CONTACT SHASHANK :8179026338.

(Ro.No.36049)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

# ఘనంగా యాదవ కురుమ ఆత్మీయ సమ్మేళనం

## సదరు ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తాం : మంత్రి కేటీఆర్



ఆత్మీయ సమ్మేళనం మాట్లాడుతున్న మంత్రులు కెటిఆర్, చిత్రంలో హరీష్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఇతర నాయకులు

**తుర్కయంజాల్, అక్టోబరు 26 ప్రభాతవార్త :** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతిని అధికారికంగా నిర్వహిస్తామని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ మన్నెగూడ బిఎంఆర్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన యాదవ కురుమ ఆత్మీయ సమ్మేళనా నికి ముఖ్యఅతిథులుగా మంత్రులు కెటిఆర్, హరీష్‌రావు విచ్చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ నలుమూలలకు వ్యాపించిన సదర్ ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని హామీ ఇచ్చారు. గతంలో ఎవరూచేయని విధంగా సీఎం కేసీఆర్ గొల్ల కురమలను అభి వృద్ధి చేసి, వారిని ఆర్థికంగా నిలబెట్టారని తెలిపారు. గొల్ల కురమలకు 75 శాతం సబ్సిడీతో గొర్రె పిల్లలు ఇచ్చిన ఏకైక సీఎం కేసీఆర్ మాత్రమేనని చెప్పారు. యాదవులకు ఆత్మ గౌరవ భవనాలు నిర్మితమవుతున్నాయని, రెండు మూడు నెలల్లో ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు. హుజూరా బాద్‌లో దళితబంధు పథకం పెడితే ప్రతిపక్షాలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారని, అయినా ఇప్పటివరకు తాము 24వేల కుటుంబాలకు దళితబంధు అమలు చేశామని తెలి పారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రజలకోసం చేసిందేమీ లేద న్నారు. రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధరను రూ.1200 వందలకు పెంచిందన్నారు. మునుగోడులో ఓట్లకోసం పూటకో మాట మాట్లాడే జూటాగాళ్లు వస్తున్నారని, వారికి ఓటర్లు బుద్ధి చెప్పాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, రాజ్యసభ సభ్యులు ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ ఏగ్గె మల్లేశం కురుమ, రాష్ట్ర గొర్రెల మేకల అభివృద్ధి సహకార సంఘం చైర్మన్ దూదిమెట్ల బాలరాజ్‌యాదవ్, ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, అంజయ్యయాదవ్, నోముల భరత్, వట్టే జానయ్య యాదవ్, కొత్త కురుమ సత్తయ్య, కూరాకూల నాగభూషణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# టిఆర్ఎస్ పార్టీ శ్రేణులకు అండగా ఉంటా: మంత్రి



సబితారెడ్డి సమక్షంలో టిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బిజెపి నాయకులు, కార్యకర్తలు

**సరూర్‌నగర్, అక్టోబర్ 26 ప్రభాతవార్త:** మహేశ్వరం నియో జకవర్గంలో టిఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కిందకు వచ్చే బాలాపూర్, మల్లాపూర్‌లకు సంబంధించిన డివిజన్ల నుండి కాంగ్రెస్, బిజెపిలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్త లు పెద్ద సంఖ్యలో టిఆర్ఎస్ పార్టీలో చేరారు. బాలాపూర్, మల్లాపూర్‌లకు చెందిన టిఆర్ఎస్ పార్టీ నేతల ఆధ్వర్యంలో బాలాపూర్ కాంగ్రెస్ నాయకుడు నేనావత్ గోపాల్ నాయక్, బాలాపూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తలారి గిరి ముది రాజ్, వరికుప్పల సురేష్ రాజ్, మహేష్, శివకుమార్, నరేందర్, అనిల్, అరుణ్, తరుణ్, మురళి, ప్రశాంత్, సత్య, మనోజ్, శ్రీకాంత్, సాయి, నర్సింహ, హరిప్రసాద్, శివ, శంకర్, రాజులతో పాటు దాదాపు వంద మంది జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సబితా రెడ్డి సమక్షంలో గులాబి గూట్లోకి చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించా రు. అనంతరం ఆమె మాట్లాడుతూ సిఎం కెసిఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులైన వారు టిఆర్ ఎస్‌లో చేరుతున్నారనా న్నరు. పార్టీలో చేరిన వారికి అండగా ఉండి గుర్తింపునిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్య క్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు గుండోజు రఘునందనచారి, నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, కళ్ళెం ఎల్లారెడ్డి, అత్తాపురం శ్రీనివాస్‌రెడ్డి, తిమ్మని గిరీష్, జూకంటి సురేష్‌గౌడ్, కొప్పుల రాజు, బొర్ర మాధవరెడ్డి, అల్వాల్‌రెడ్డి, కందికంటి అరవింద్ గౌడ్, కోటగిరి మురళి, హరిగౌడ్ వంగేటి అశ్విన్‌రెడ్డి, రిథున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ హెచ్ఎండిఏ లేఅవుట్‌లో సదుపాయాలు కరువు..?

### అధ్వాన్నంగా తయారైన రోడ్లు : నీటి సౌకర్యం లేక చర్మవ్యాధులు

### ఖాళీ చేసి వెళ్లిపోతున్న ప్రజలు : భారీగా పడిపోయిన ప్లాట్ల ధరలు



హెచ్ఎండిఏ నిర్మించిన లేఅవుట్ ప్రధాన ద్వారం దృశ్యం



అంతర్గత రోడ్లపై ఏరులై పారుతున్న మురుగునీరు దృశ్యం

**ఉప్పల్, అక్టోబరు 26 ప్రభాతవార్త :** మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్‌లో భాగంగా ఉప్పల్, రామంతాపూర్ భగాయత్‌లో చేపట్టిన మాడల్ లేఅవుట్ పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా తయారైంది. ఉప్పల్ భగాయత్ రైతుల నుంచి భూములు తీసుకుని ప్లాట్లు అప్పగించిన హెచ్ఎండిఏ అధికా రులు అందులో మౌళిక సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రజలు తీవ్రఇక్కట్లు పడుతున్నారు. వివరాలు ఇలాఉన్నాయి. ఉప్పల్ భగాయత్ పరిధిలోని సుమారు 733 ఎకరాలు, రామంతాపూర్ భగాయత్ పరిధిలోని 95 ఎకరాలు హెచ్ఎండిఏ మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్ కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఇందులో భూములు కోల్పోయిన ప్రతి ఎకరా భూమి ఉన్న రైతుకు వెయ్యిగజాలు ఇచ్చేవిధంగా హెచ్ఎండిఏ అంగీకారం తెలిపిం ది. సేకరించిన భూమిలో 104 ఎకరాలు వాటర్‌వర్క్స్ విభాగానికి, 150 ఎకరాలు సివరేజీ బోర్డు తీసుకుంది. మరో 150ఎకరాలు మెట్రో రైలు స్టేషన్ ఏర్పాటు కోసం ప్రభుత్వం తీసుకుంది. అయితే ఇంకా 413 ఎకరాలు భూమి ఉండగా దీనిని మాడల్ లేఅవుట్‌గా తయారు చేశారు. లేఅవుట్‌లో 40 శాతం స్థలాన్ని ప్లాట్లుగా అభివృద్ధి చేసి మిగతా 60 శాతం స్థలాన్ని వివిధ వసతుల కోసం కేటాయించారు. మూసీ వరద నీటి ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకుని మూసీ పక్కన 200 అడుగుల స్థలాన్ని బఫర్ జోన్‌గా ప్రకటించి, దాని పక్కనే మరో 100 అడుగుల స్థలంలో రోడ్లు ఉండే విధంగా ప్లాన్ రూపొందించారు. అధికారులు రూపొందించిన లేఅవుట్‌లో వెయ్యి గజాలు ఉన్న ప్లాట్‌లకు 80 అడుగుల రోడ్ల నుంచి తకు వ గజాలు ఉన్న ప్లాటుకు 40 అడుగుల రోడ్లు ఉండే విధంగా రూపొందించారు. ఒక్కో ప్లాటు వెయ్యి, 500, 300, 200, 150 గజాలతో తయారు చేశారు. వసతుల కోసం పార్కులకు అధిక స్థలాన్ని కేటాయించగా, పోలీస్‌స్టేషన్ కోసం 6684 గజాలు, పోస్ట్ ఆఫీసుకు 2266, స్కూల్స్ కోసం 4632 గజాలు, షాపింగ్ సెంటర్ కోసం 7456 గజాలు, ఇతర అవసరాల కోసం మరికొంత స్థలాలు కేటాయించారు.

**హెచ్ఎండిఏ లేఅవుట్‌లో సదుపాయాలు కరువు :**

ఉప్పల్‌లో రైతుల నుంచి భూములు తీసుకున్న ప్రభుత్వం నిర్వాసితులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు అప్పగించింది. ప్లాట్లు తీసుకున్న వారిలో కొందరు విక్రయాలు చేసుకోగా, మిగిలిన ప్లాట్ల నిర్వహకులు తమ పిల్లలకోసం తమ వద్దే ఉంచుకున్నా రు. హెచ్ఎండిఏ అధికారులు రెండు సార్లు ప్లాట్లు వేలం వేసి సుమారు రూ.2వేల కోట్ల వరకు ఆదాయం పొందింది. అయితే ప్లాట్లు సరిగ్గా అభివృద్ధి చేయకపోవడంతో చాలా మంది నిర్మాణాలు చేసుకునేందుకు ముందుకురావడం లేదు. ఉదయం, సాయంత్రం వేళలలో అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోయాయని, రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సదుపాయం కల్పించడంలేదని అసోసియేషన్ కన్వీనర్ మధుసూధన్‌రెడ్డి పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా స్పందించడం లేదన్నారు.

**హెచ్ఎండిఏ నివాసితులకు చర్మవ్యాధులు :**

ఉప్పల్ హెచ్ఎండిఏ లేఅవుట్ మూసీ సమీపంలో ఉండడం తో అందులో ఇళ్లనిర్మించుకుని ఉంటున్న వారు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ప్రభుత్వం మూసీ దుర్వాసన రాకుండా తగు చర్యలు తీసుకుంటామని మొదట ప్రకటించినా ఆచరణలో అమలుకు నోచుకోలేదు. భగాయత్‌లో ఇప్పటి వరకు మంచి నీటి సదుపాయం, డ్రైనేజీవ్యవస్థ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో బోరునీటిపైనే ఆధారపడిన అనేక మంది చర్మవ్యాధుల బారిన పడుతున్నారు. మురుగునీటి కారణంగా జుట్టు ఊడి పోవడంవంటి సమస్యలు వస్తున్నాయని పలువురు పేర్కొం టున్నారు. గతంలో రూ.60 నుంచి 70వేలకు గజం పలికిన ప్లాట్లు ఇప్పుడు భారీగా పడిపోయినట్లు నిర్వాసితులు పేర్కొం టున్నారు. లేఅవుట్‌లో నిర్మించిన ఇళ్లలో ఉండలేక చాలా మంది ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోతున్నారని, రాత్రి వేళ వీధి దీపాలు ఉండడం లేదని, అసాంఘిక శక్తుల ఆగడాలు పెరిగి పోయాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే తమ వద్ద ప్లాట్లు ఉంచుకున్న పలువురు యజమానులు వీటిని విక్రయిం చుకోలేక, ఉండలేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి లేఅవుట్ అభివృద్ధిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# చెరువులు, కుంటల అభివృద్ధికి రూ.8 కోట్ల నిధులు మంజూరు

**సరూర్‌నగర్, అక్టోబర్ 26 ప్రభాతవార్త:** రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి చొరవతో బడంగ్‌పేట్ కార్పొ రేషన్‌లో వివిధ చెరువులు, కుంట ల సుందరీకరణకు రూ.8 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు నిధుల విడుదలకు సంబంధించిన హెచ్ఎండిఏ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా అల్మాస్‌గూడ కోమటికుంట సుందరీ కరణకు రూ.2.50 కోట్లు, పోచమ్మ కుంటకు రూ.2 కోట్లు, మల్లాపూర్ సుద్దమోని కుంటకు రూ.2 కోట్లు, గుర్రంగూడ ఎక్కోని కుంట కట్ట మరమ్మతులకు రూ.50 లక్షలు, కుర్మల్‌గూడ అంతిరెడ్డి కుంట కట్ట పటిష్టం చేసే పనులకు రూ.కోటి నిధులను మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో స్పందించిన మంత్రి సబితా రెడ్డి పెద్ద ఎత్తున అభివృద్ధి నిధులను మంజూరు చేయించినం దుకు హర్షం వ్యక్తం చేస్తూ సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

# షార్ట్ సర్క్యూట్‌తో బైక్ దుకాణం దగ్ధం

**ఉప్పల్, అక్టోబరు 26 ప్రభాతవార్త :** విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ తో బైక్ దుకాణం దగ్ధమైన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ భరత్‌నగర్‌కు చెందిన గిమికొట్ల కార్తీక్ ఉప్పల్ బీరప్ప గడ్డ వద్ద బైక్ మెకానిక్ దుకాణం నిర్వహిస్తున్నాడు. అయితే సోమవారం సాయంత్రం దుకాణంలో పూజలు చేసి అనంత రం మూసి వేసి ఇంటికి వెళ్లిపోయాడు. రాత్రి ఏడున్నర గంటల సమయంలో దుకాణం నుంచి పొగలు వస్తుండడం తో స్థానికులు గమనించి అతనికి సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకుని చూడగా అందులోని 50 లీటర్ల ఇంజన్ అయిల్, రెండు బైక్‌లు పూర్తిగా మరో రెండు బైక్‌లు పాక్షికంగా కాలిపోయినట్లు తెలిపారు. షార్ట్ సర్క్యూట్ కార ణంగానే మంటలు అంటుకుని ఉంటాయని అనుమానిస్తున్నా రు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# అనుమతి లేకుండా రెండు భారీ వృక్షాల నరికివేత

### నామమాత్రపు జరిమానాతో సరిపెట్టిన అటవీశాఖ అధికారులు

**సైదాబాద్, అక్టోబరు 26 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ లక్ష్మీనగర్ ప్రధాన రహదారిపై ఉన్న రెండు భారీ వృక్షాలను తమ దుకాణానికి అడ్డుగా ఉన్నాయని కొట్టి వేయడంతో అట వీ శాఖ అధికారులు జరిమాన విధించారు. వివరాలు ఇలా ఉన్నాయి. లక్ష్మీనగర్ ప్రధాన రహదారిపై ఇటీవల నూతనం గా ఏర్పాటు చేసిన చాట్ బండార్ నిర్వాహకులు తమ దుకా ణానికి అడ్డుగా ఉన్న రెండు భారీ వృక్షాల కొమ్మలను అటవీ శాఖ అధికారుల అనుమతి లేకుండా పూర్తిగా కొట్టివేశారు. దీంతో కాలనీ వాసుల ఫిర్యాదుతో అటవీశాఖ అధికారులు చాట్ బండార్ నిర్వాహకులకు రూ.11 వేల జరిమాన విధిం చారు. అయితే రెండు భారీ వృక్షాలను అనుమతి లేకుండా నరికి వేసినప్పటికీ కేవలం రూ.11 వేలు జరిమాన విధించి అటవీశాఖ అధికారులు చేతులు దులుపుకోవడం పట్ల కాలనీ వాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు ఉండాలి: పారిజాత



అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, అక్టోబర్ 26 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సి పల్ కార్పొరేషన్‌లోని డివిజన్లలో జరిగే అభివృద్ధి పనుల్లో నాణ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అధికారులకు సూచించారు. కార్పొ రేషన్‌లోని 1వ డివిజన్‌లో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనులను అదే విధంగా 20వ డివిజన్‌లో నిర్మిస్తున్న బిటి రోడ్డు పనులను బుధవారం ఆమె డిఇఇ అశోక్‌రెడ్డి, ఎఇఇ రాంప్రసాద్‌రెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కార్పొరేషన్‌లో ఎటువంటి అభివృద్ధి పనైనా అందులో నాణ్యతా ప్రమాణాలు ఉండేలా చూస్తున్నా మన్నారు. ముఖ్యంగా అధికారులు సంబంధిత కాంట్రాక్టర్లు నాణ్యత పాటించేలా పర్యవేక్షించాలని కోరారు. కార్యక్రమం లో కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, వర్క్ ఇన్స్‌పెక్టర్ శేషిరెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

# ఉత్సవాలు మత సామరస్యాన్ని పెంపొందిస్తాయి : ఆజం అలీ



ఆజం అలీని సన్మానిస్తున్న ప్రవీణ్‌కుమార్ తదితరులు

**మలక్‌పేట, అక్టోబరు 26 ప్రభాతవార్త :** ఉత్సవాలు మత సామరస్యాన్ని పెంపొందిస్తాయని టిఆర్ఎస్ పార్టీ మలక్‌పేట నియోజకవర్గ ఇంఛార్జి ఆజం అలీ పేర్కొన్నారు. నగర వ్యవ సాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వంజరి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో మలక్‌పేట మార్కెట్‌లో దీపావళి పండుగ సంద ర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలకు మార్కెట్ కమిటీ ఛైర్మన్ అనితానాయక్, వైస్‌ఛైర్మన్ భూమేష్‌తోపాటు ఆయన విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమంకోసం టిఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుంద న్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు లలిత, ప్రవీణ్‌కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత ఉత్పత్తులపై జీఎస్టీని ఎత్తి వేయాలి: ఛైర్మన్ ఉప్పల

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 26 ప్రభాతవార్త :** చేనేత ఉత్పత్తులపై పూర్తిగా జీఎస్టీని ఎత్తివేయాలని రాష్ట్ర పర్యాటకశాఖ అభివృద్ధి ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా డిమాండ్ చేశారు. మంత్రి కేటీఆర్ పిలుపుమేరకు ప్రధాని మోడీకి ఉప్పల శ్రీనివాస్ గుప్తా బుధవారం పోస్ట్‌కార్డ్ రాశారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ చేనేత కళాకారులంతా గ్రామీణ ప్రాంతాలకు చెందిన బలహీనవర్గాల పేదలని వారిని జీఎస్టీ పేరిట దోపిడీ చేయడం బాధాకరం అన్నారు. ప్రధాని మోడీ సారధ్యంలోని కేంద్ర ప్రభుత్వము చేనేతకు వాడే ముడి సరుకులపై, వస్త్రాల పై 5శాతం విధించి దాన్ని 12శాతానికి పెంచాలనుకోవడం చేనేత కార్మికుల పాలిట శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు, నూలుపై సైతం సబ్సిడీ ఎత్తేయటం బాధాకరమన్నా రు. చేనేత ముడి సరకులపై, వస్త్రాలపై జీఎస్టీ ని వెంటనే రద్దు చేయాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు.

# ఉప్పల్ భగాయత్‌లో మౌళిక సదుపాయాలు కల్పించాలని వినతి



మౌళిక సదుపాయాలు కల్పించాలని మంత్రి మల్లారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న మేకల మధు, అర్జున్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 26 ప్రభాతవార్త :** ఉప్పల్ భగాయత్‌లో మౌళిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ భగాయత్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ మేకల మధుసూధన్‌రెడ్డి, గోనె అర్జున్‌రెడ్డిలు కోరారు. ఈ మేరకు బుధవారం మంత్రి మల్లారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పిం చారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లా డుతూ ఉప్పల్ భగాయత్‌లో తాగునీరు సౌకర్యం కల్పించాల ని, డ్రైనేజీ సమస్య ఉందని తెలిపారు. భగాయత్‌లో వీధి దీపాలు సరిగ్గా లేకపోవడంతో ప్లాట్ల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. భగాయత్‌లో ఇప్పటికే చాలా మంది ఇళ్లు నిర్మాణాలు చేసుకుని ఉంటున్నారని, వారికి సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వానికి ఈ లేఅవుట్‌పై 2వేల కోట్ల ఆదాయం వచ్చిందని, దీని అభివృద్ధిగురించి పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై మంత్రి స్పందించి మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్‌ను లేఖ రాసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు భగాయత్ ప్లాట్ల యజమానులు పాల్గొన్నారు.

# నాగోల్ ఫ్లైఓవర్ ప్రారంభంతో తొలగిన ట్రాఫిక్ ఇబ్బందులు

### ట్రాఫిక్‌ను అధిగమించడమే ధ్యేయం - రిజిస్ట్రేషన్ సమస్యకు చెక్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్ చిత్రంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 26 ప్రభాతవార్త :** నాగోల్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవ సభలో మంత్రి కేటీఆర్ రిజిస్ట్రేషన్ సమస్య త్వరలో పరిష్కరించేందుకు అంత సిద్ధం చేశామని మంత్రి ప్రకటించడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. దశాబ్దా లుగా తాము చేస్తున్న పోరాటానికి మంత్రి కేటీఆర్ ద్వారా ప్రతిఫలం లభించబోతుందని పలువురు బాధితులు ఆనందం వ్యక్తం చేశారు. టిఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీ మేరకు గత రెండు సంవత్సరాలుగా రిజిస్ట్రేషన్ సమస్యకు సంబంధించి అనేకసార్లు ఈ విషయమై కసరత్తు జరిపినట్లు సభలో కేటీఆర్ తెలిపారు. కేవలం నాలుగైదు రోజుల్లోనే రిజిస్ట్రేషన్ సమస్యకు చెక్ పెడుతూ ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చే విధంగా చర్యలు చేపడతామన్నారు. రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కరిస్తూ త్వరలోనే ఎల్బీనగర్‌లోనే పెద్ద ఎత్తున మరొక సమావేశాన్ని కూడా నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గానికి అధిక ప్రాధాన్యతను ఇస్తూ కోట్లాది రూపాయలు వెచ్చించి ఫ్లైఓవర్లు, స్కైఓవర్లు, అండర్ పాసులు, మంచినీటి రిజర్వాయర్లు, రోడ్లు, పార్కులు, అంత ర్జాతీయ ప్రమాణాలతో కూడిన స్మశాన వాటిక, బస్సుబే తదితర మౌలికవసతులు కల్పించామని తెలిపారు. నియోజక వర్గ అభివృద్ధిపై ముఖ్యంగా రిజిస్ట్రేషన్ల సమస్యపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చాలా పట్టుదలతో ఉన్నారని ఆయన అన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని నివారించడానికి ప్రభుత్వం చేపట్టిన వ్యూహాత్మక రహదారి అభివృద్ధి పథకంలో భాగంగా నిర్మాణమైన నాగోల్ ఫ్లైఓవర్ బుధవారం నుంచి అందుబాటులోకి అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. ఎస్ఆర్‌డిపి ద్వార ప్రభుత్వం నిర్మించిన నాగోల్ ఫ్లైఓవర్ రూ.143.58 కోట్లతో 990మీటర్ల పొడవు తో ఆరులేన్ల ఫ్లైఓవర్‌ను మంత్రి కేటీఆర్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాఫిక్‌ను నియంత్రించి వాహనాల రాక పోకలను సులువు చేసే లక్ష్యంతో వ్యూహాత్మక రోడ్ల అభివృద్ధి ప్రణాళిక ఎస్ఆర్‌డీపీలో భాగంగా బల్దియా నిర్మిస్తున్న ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల పనులు పరుగులు పెడుతున్నాయని, ఈ ఫలాలు మహానగరానికి మహర్దశను తీసుకువస్తున్నాయని తెలిపారు. పలు చోట్ల ఉన్న రిజిస్ట్రేషన్ సమస్యను పరిష్కా రం చేసి 4,5 రోజుల్లో తీపి కబురు అందిస్తానని మంత్రి కేటీఆర్ ప్రకటించడంతో హర్షధ్వానాలు వెలువెత్తాయి.

# శివసాయినగర్‌లో కార్తీక మాస పూజలు ప్రారంభం



శివసాయినగర్ ఆలయంలో రుద్రాభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం

**సరూర్‌నగర్, అక్టోబర్ 26 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని శివసాయినగర్ కాలనీలోనున్న శ్రీ గౌరి నీలకంఠేశ్వర స్వామి సమేత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో బుధవారం పవిత్ర కార్తీక మాస ప్రారంభ పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సూర్యగ్రహణ సంప్రోక్షణ జరిపిన తర్వాత ఆలయంలో ఏకవార రుద్రాభిషేకంతో కార్తీక మాస పూజలను భక్తిశ్రద్ధలతో ఆరంభించారు. గాయత్రీ సేవా సం ఘం ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన పూజారి వడ్లమాని లక్ష్మీ గణపతిరావు నిర్వహించిన ఈ పూజల్లో వెంకట రత్నం, శ్రీనివాసప్రసాద్, శివరామప్రసాద్, లక్ష్మణరావు, లక్ష్మీ నర్సిం హమూర్తి, రామచంద్రరావు, చల్లపల్లి సుబ్రమణ్యశర్మ, కృష్ణ, ఎంవి కృష్ణారావు, వెంకటరమణ, బాపిరాజు, శ్రీనివాస ఆంజనేయ శాస్త్రి, విశ్వనాథ బాబు, రామకృష్ణ, నూకరాజు శ్రీనివాసరావు, పిడమర్తి రమణ తదితరులు పాల్గొన్నారు. కార్తీక మాసం సందర్భంగా ప్రతి రోజూ రుద్రాభిషేకాలు ఉంటాయని ఆలయ ఛైర్మన్ తీగల సుభాష్‌రెడ్డి తెలిపారు.

# ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారం : కార్పొరేటర్



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

**హయత్‌నగర్, అక్టోబరు 26 ప్రభాతవార్త :** డివిజన్ పరిధి లోని అన్ని కాలనీల్లో కనీస సదుపాయాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామని ప్రాధాన్యత క్రమంలో పనులను పూర్తిచేసి సమస్యలు లేకుండా చూస్తానని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన డివిజన్ పరిధిలోని మిధాని కాలనీ, గణేష్‌నగర్, వర్ధయ్య కాలనీల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. జాతీయ రహదారి నుంచి వచ్చే వరదనీరు వెళ్లడానికి ఏర్పాటుచేసిన ట్రంక్‌లైన్ తమ కాలనీవరకు వచ్చి నిలిచిపోవడంతో వర్షపునీరు కాలనీ లోని ఖాళీ ప్రదేశంలో చేరుతోందని దీని కారణంగా దోమలు ఎక్కువై కాలనీవాసులు వ్యాధుల భారిన పడుతున్నారన్నారు. వరదనీరు కాలనీలో నిలువకుండా ట్రంక్‌లైన్ పనులను పూర్తి చేయాలని కోరారు. మిధాని కాలనీలో విద్యుత్ స్థంభాలకు స్ట్రీట్ లైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరారు. అనం తరం కాలనీలో నూతనంగా సీసీరోడ్లు మంజూరై పనులు ప్రారంభమైన సందర్భంగా కాలనీఅసోసియేషన్ ప్రతినిధులు కార్పొరేటర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో డీఈఈ దామోదర్, ఏఈ నరేంద్రతేజ, ఆయా కాలనీల ప్రతినిధులు మల్లారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అంజయ్యగౌడ్, నాయకులు ఎర్రవెల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు : కార్పొరేటర్ శాంతి శేఖర్



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శాంతి శేఖర్

**నాచారం, అక్టోబర్ 26 ప్రభాతవార్త:** డివిజన్‌లో కొనసాగుతు న్న వివిధ అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దని కార్పొరేటర్ శాంతిసాయిజన్ శేఖర్ జిహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారుల కు సూచించారు. వార్డు కార్యాలయంలో అధికారులతో కార్పొ రేటర్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నాలుగు బ్రిడ్జి నిర్మా ణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని. అదేవిధంగా శాంతి గార్డెన్స్ వద్ద వర్షా కాలంలో ముంపు సమస్య ఉందని దీనికోసం కోటి రూపాయలు మంజురయ్యాయని పేర్కొన్నా రు. మంజూరైన వివిధ పనులను అధికారులు త్వరితగతిన శంకు స్థాపన, ప్రారంభోత్సవాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ లింగారావు, వర్క్ ఇన్స్‌పెక్టర్ విజయ్‌కుమార్, టీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్, కట్ట బుచ్చన్న గౌడ్, సుగుణకర్‌రావు, శ్రీనివాస్ తదిత రులు పాల్గొన్నారు.

# కలుషిత నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు : కార్పొరేటర్ శ్వేత



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్వేత

**సైదాబాద్, అక్టోబరు 26 ప్రభాతవార్త:** ఐఎస్‌సదన్ డివిజన్‌లో కలుషిత నీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టా లని కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి అధికారులకు సూచించారు. వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి బుధవారం డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీ, ఎస్.ఎన్.రెడ్డి కాలనీల లో పర్యటించి డ్రైనేజీ, త్రాగునీటి సమస్యలను పరిశీలించా రు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ డివిజ న్‌లో డ్రైనేజీ, కలుషిత త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించా రు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

# వైకుంఠ రథాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి



వైకుంఠ రథాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

**నాచారం, అక్టోబర్ 26 ప్రభాతవార్త:** మాల్లాపూర్ డివిజన్‌లో ని వైకుంఠ దామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైకుంఠ రథాన్ని కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆఖరి మజిలి అంత్యక్రియల కోసం వైకుంఠరథాన్ని ప్రారంభించడం సంతోషమం అన్నారు. ఈ కార్యక్రమంలో కాటికాపరి పేగుడ రమేష్, గణేష్, ఉపేందర్, నాయకులు తాండ వాసుదేవ్ గౌడ్, తీగుళ్ల శ్రీనివాస్ గౌడ్, యాదగిరి గౌడ్, రఘువరణ్, శ్రీకాంత్, రాపోలు శ్రీనివాస్, నాగరాజు, శ్రవణ్, రాజు తధితరులు పాల్గొన్నారు.

# పోస్టల్ కవర్ విడుదల పట్ల హర్షం: లింగాల హరిగౌడ్




కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని సత్కరిస్తున్న హరిగౌడ్

**సైదాబాద్, అక్టోబరు 26 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ పోస్టల్ కవర్‌ను విడుదల చేయడం పట్ల బిజెపి నాయకులు లింగాల హరిగౌడ్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం త్యాగరాయ గానసభలో జరిగిన కార్యక్రమంలో పోస్టల్ కవర్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం హరిగౌడ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు.

# ఉత్సవాలు సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపాలు : వంజరి వినోద్‌కుమార్



పూజలో పాల్గొన్న బాలకృష్ణయాదవ్, బొల్లు కిషన్ తదితరులు

**మలక్‌పేట, అక్టోబరు 26 ప్రభాతవార్త :** ఉత్సవాలు సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపాలని తెలంగాణ మిర్చి అసోసి యేషన్ అధ్యక్షుడు వంజరి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మలక్‌పేటలో మార్కెట్‌లో దీపావళి సందర్భంగా ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఛైర్మన్ జి.బాలకృష్ణ యాదవ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్, నాయకులు రాంరెడ్డి, మహేష్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, సురేష్, రఘు, కొట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.